కాంగ్రెస్‌లో కారుకూతలే

- రాష్ట్ర ప్రజలను మోసం చేసిన రేవంత్ పాలన
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, చిత్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

6

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తిరూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లవద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ కమిటీ అవగాహన కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ హాజరై మాట్లాడారు. మానసికంగాను, శారీరకంగాను వేధించడం ర్యాగింగ్ కిందికి వస్తుందని, అటువంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. వైద్య వృత్తికి మంచి గౌరవం ఉంటుందని, ఎవరూ ర్యాగింగ్ జోలికి పోకుండా భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం వైద్య విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు చేస్తే వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటీలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడి కల్ కళాశాల ప్రిన్సిపాల్ సునందిని, తహసీల్దార్ రమేష్ రెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

దక్కని శాఖ

తక్కువ కేడర్



రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌వోల సంఘం నాయకులు

- గ్రూప్-4 నియామకాలతో మళ్లీ ఇరకాటంలో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు
- ఇప్పటికే రెవెన్యూ సర్వీసు పోయింది, మళ్లీ పోతుందనే ఆందోళన
- జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు బదులు దిగువ స్థాయిల్లో పోస్టింగ్
- పదోన్నతికి అన్నీ పాసైనా సర్వీసు పోవడంతో ఇబ్బంది
- 010 హెడ్ కాకపోవడంతో పలు బీమా పథకాలకు కూడా అనర్హత
- మార్గదర్శకాలు లేకపోవడంతో ఇష్టారీతిన వినియోగిస్తున్న పరిస్థితి

గ్రామీణ ప్రాంతాల్లోని రెవెన్యూ వ్యవహారాల్లో కీలకంగా ఉన్న వీఆర్‌వోలు, వీఆర్‌ఏల వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసి ఆ సిబ్బందిని మాత్రం ఆగమాగం చేసింది. వారు సర్వీసును కోల్పోయి, ఉద్యోగం ఉన్నదో లేదో కూడా తెలియకుండా విధుల కోసం ఎదురు చూశారు. తీరా పోస్టింగ్ ఇచ్చినా సరైన మార్గదర్శకాలు లేక వివిధ ప్రభుత్వ విభాగాల్లో తక్కువ క్యాడర్‌లో కొనసాగుతున్నారు. ఇప్పుడు వారు పనిచేస్తున్న స్థానాల్లో కొత్తగా గ్రూప్ -4 ఉద్యోగుల కేటాయింపు జరుగుతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని చెబుతుండ టంతో పాత పోస్టుల్లోనైనా తమను కేటాయించేరా అని ఎదురుచూస్తున్నారు.

గ్రామ రెవెన్యూ అధికారులుగా తీసుకోవాలి



ఆర్‌వోఆర్ యాక్ట్ 2024 అమలు చేయడంలో భాగంగా గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అందులో అనుభవం ఉండి ఇతర శాఖల్లో విధులు, కేడర్, సర్వీసు లేకుండా పనిచేస్తున్న వీఆర్‌వోలను తీసుకోవాలి. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల వీఆర్‌వోలు ఇప్పటికే చాలా ఇబ్బందులు పడ్డారు. నేను దాదాపు 12 సంవత్సరాల సర్వీసును కోల్పోయాను. ఇప్పుడు బీసీ వెల్ఫేర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఇప్పుడు గ్రూప్-4 ఉద్యోగులు వచ్చారు. సర్వీసును మళ్లీ కోల్పోవాల్సి ఉంటుంది.

- లక్ష్మీనరసింహ, వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత రెవెన్యూ సేవలను సులభతరం చేయడం కోసం ధరణిని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో రెవెన్యూ వ్యవస్థలో వీఆర్‌వోల వల్ల అవినీతి పెరిగిపోయిందని జీవో 29 ద్వారా సెప్టెంబరు 2020న రద్దు చేశారు. ఆ తర్వాత విధులు లేకుండానే దాదాపు రెండు సంవత్సరాలు జీతాలు ఇచ్చారు. తర్వాత ఆగస్టు 2022న జీవో నెంబరు 121 ద్వారా లక్కీడిప్ వేసి అర్హతలు లేకుండానే వివిధ శాఖల్లో వారిని సర్దుబాటు చేశారు. వీఆర్‌వో పోస్టు సరిసమానంగా జూనియర్ అసిస్టెంట్ కేడర్ పోస్టింగ్ ఇవ్వాలి. కానీ, ఆ పోస్టులు లేని శాఖల్లో కూడా వీరికి పోస్టింగ్ ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్‌కు బదులు పంచాయ తీరాజ్ సూపరింటెండెంట్, రికార్డు అసిస్టెంట్, వార్డు ఆఫీసర్, తోటమాలి, డ్రైవర్ పోస్టులను కూడా కేటా యించారు.

ఒక మహిళా వీఆర్‌వోకు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖలో ఏకంగా డ్రైవర్ పోస్టు ఇచ్చారు. వేతనం జూనియర్ అసిస్టెంట్‌ది వస్తున్నప్పటికీ విధులు మాత్రం దిగువ స్థాయిలో నిర్వహించాల్సి ఉంటోంది. అయితే ఇతర విభాగాలకు బదిలీ చేసినప్పుడు వారికి సరైన శిక్షణ కూడా ఇవ్వకపోవడంతో ఆ పనిచేయించుకోలేక పోతున్నారు. లాస్ట్ పే సర్టిఫికెట్ బలవంతంగా తీసుకొని సర్దుబాటు చేసినప్పటికీ ఇప్పుడు ఇస్తున్న వేతనంలో కేవలం సీపీఎస్‌కు కట్ చేస్తున్నప్పటికీ పలు బీమా పథకాలకు సంబంధించి కోతలు మాత్రం జరగడం లేదు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని కోల్పోతున్నారు. అయితే సర్దుబాటు చేసిన తర్వాత రెండేళ్లయినా ఇప్పటికీ పలువురు విధులు లేకుండానే జీతాలు తీసుకుంటున్న పరిస్థితి ఉన్నది.

- సర్వీసు కోల్పోయిన వీఆర్‌వోలు...

ప్రతీ ఉద్యోగికి సర్వీస్ అనేది చాలా కీలకం. ఒకవేళ ఇతర శాఖలకు

- మిగతా 6లో...

ఆదాయమున్నా..

అభివృద్ధి సున్నా..

- అభివృద్ధికి నోచుకోని అలంపూరు ఆలయాల సముదాయం
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న భక్తులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

అలంపూరు డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదో శక్తి పీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు ఆదాయం వస్తున్నా.. అభివృద్ధికి నోచుకోవడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరులోని పుణ్యక్షేత్రానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ ఏడాది మాన్యం భూముల ద్వారా, హుండీ ద్వారా ఆదాయం వస్తోంది. 110 రోజుల హుండీ లెక్కింపులో రూ.58,66,623లు వచ్చింది. ఈ నెల ఎనిమిదో తేదీన 150 రోజుల హుండీ లెక్కించగా రూ.1,06,04,436 ఆదాయం వచ్చింది. పూజా సామగ్రి, బుక్‌స్టాల్, వాహనాల రుసుం, చీరల వేలం, కొబ్బరి చిప్పలు, వసతి గదులు, క్యాంటీన్, టాయిలెట్స్ వీటికి ప్రతీ సంవత్సరం టెండర్ ద్వారా మరింత ఆదాయం వస్తుంది. గతేడాది కంటే ఈ ఏడాది రూ.3.48 కోట్ల ఆదాయం టెండర్ల ద్వారా సమకూరింది. ఇలా ప్రతీ సంవత్సరం కోట్లలో ఆదాయం ఉంటే అభివృద్ధి మాత్రం శూన్యమనే చెప్పవచ్చు.



అలంపూరు ఆలయాల సముదాయం

కనీస వసతులు కరవు..

ఆలయానికి వచ్చిన భక్తులు రాత్రి సమయంలో బస చేసేందుకు కనీసం షెడ్డు కూడా లేక ఆరు బయటే నిద్రిస్తున్నారు. లగేజీ కౌంటర్లు, పుష్కరాల సమయంలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన టాయిలెట్లు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలి. చండీహోమాలకు సరిపడా అర్చకులు లేక మమా అనిపిస్తున్నారు. భక్తుల క్యూ లైన్లలో తాగునీటి సౌకర్యం కల్పించాలి. నవబ్రహ్మ ఆలయాలకు దూప దీప నైవేద్య సౌకర్యం కల్పించాలి.

భక్తులకు కనీస వసతులు కల్పించాలి..



పుణ్యక్షేత్రంలో బస చేయటానికి వస్తే షెడ్డు కూడా లేక ఆల యం బయటే కింద పడుకున్నాం. వర్షాకాలంలో ఐతే పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. రాత్రి సమయంలో దోమలు, విషపురుగుల నుంచి ప్రమాదం పొంచి ఉన్నది. ఉన్నతాధికారులు స్పందించి భక్తులకు కనీస వసతులు కల్పించాలి.

- ఈశ్వరయ్య, మానవపాడు



నితిన్ తేజ (ఫైల్)

ట్రాక్టర్ కింద పడి

బాలుడి మృతి

7

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- మల్దకల్ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసిన పీఠాధిపతులు
- వైభవంగా శ్రీనివాసుడి పల్లకీ సేవ
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



వాహన సేవలో శ్రీనివాసుడు

మల్దకల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఉడిపి పలిమారు మఠం పీఠాధిపతులు విద్యాధీశ తీర్థస్వామి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో మూలరాముల పూజలు చేసి స్వామివారికి దశవిధహారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు వేద ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సుమారు రూ. 4కోట్ల విలువైన స్థలంలో వేద పాఠశాల కోసం నిర్మించిన భవనం రిజిస్ట్రేషన్ పత్రాలను దేవాలయ చైర్మన్ ప్రహ్లాదరావు దంపతులు పీఠాధిపతులకు అందజేశారు.

కొనసాగుతున్న వాహన సేవలు

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా వాహన సేవలు కొనసాగుతున్నాయి. గురువారం మార్గశిర శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శనం చేసుకున్నారు. ఉదయం పంచామృతాభిషేకం, బలిహరణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మయూర వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. రాత్రి బలిహరణ కార్యక్రమం అనంతరం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీనివాసుడిని హనుమత్ వాహనంపై పురవీధులలో దశమికట్ట వరకు ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



మయూర వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

నేడు హనుమద్ వ్రతం..

బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. అంతేగాకుండా బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించినట్లు ఆయన తెలిపారు.

అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ

- పెట్రోలింగ్ సిబ్బంది పనితీరును పరిశీలించిన ఎస్పీ



పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ గస్తీని ఎస్పీ శ్రీనివాసరావు అర్ధరాత్రి ఆసక్మికంగా తనిఖీ చేశారు. గద్వాల పట్టణంలోని రాజీవ్‌చౌక్, గాంధీచౌక్, కృష్ణవేణిచౌక్, బీరెల్లిరోడ్, రైల్వేస్టేషన్, న్యూ హౌసింగ్‌బోర్డు ప్రాంతాలలో గస్తీ, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్, ఫుట్ పెట్రోలింగ్‌లో పోలీసుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో రోడ్లపై గాని, బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాలలో, కాలనీలలో తిరిగే వ్యక్తులను పరిశీలించాలన్నారు. అనుమానాస్పదంగా కనిపిస్తే పాపిడాన్ డివైస్ ద్వారా ఫింగర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. ఇసుక, మొరం, అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని, అనుమతిలేని వాటిని నైట్ డ్యూటీ అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రాపర్టీ నేరాల పకడ్బందీ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై నైట్ డ్యూటీ ఇన్‌చార్జి అధికారి ధరూర్ ఎస్‌ఐ కి సూచనలు చేశారు. అనంతరం గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో రోజు ఎన్ని గస్తీ, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ డ్యూటీ చేస్తున్నారు, ఎంతమంది డ్యూటీలలో ఉన్నారనే విషయాలపై ఆరాతీశారు. నైట్ వాచ్ డ్యూటీ అధికారులను తనిఖీ చేసి ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ పలు సూచనలు చేశారు.

ఆకట్టుకున్న మాదిరి ఎన్నికలు

- ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

6



గెలుపొందిన అభ్యర్థులను సన్మానించిన ఉపాధ్యాయులు

నిలిచిన 'మూషిక' ప్రాజెక్టు

- మూషిక జింకల పోషణకు అనుకూలించని నల్లమల వాతావరణం

6



పిచ్చకుంట్లోని చెరువు వద్ద మూసి ఉన్న జింకల పార్కు గేటు

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

ఆత్మకూరులో అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపు



ఊరేగింపులో నృత్యం చేస్తున్న భక్తులు, విద్యార్థినులు

7

గురి చూసి కొడితే..

పతకం పక్కా

- విలు విద్యలో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు
- కోచ్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో శిక్షణ
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు



పాలమూరు స్టేడియంలో విలువిద్య శిక్షణ ఇస్తున్న కోచ్ జ్ఞానేశ్వర్

విల్లు ఎక్కు పెట్టి.. గురి చూసి బాణం వదిలారంటే లక్ష్యానికి చేరాల్సిందే.. పతకం పక్కాగా రావాల్సిందే.. అత్యంత పురాతన క్రీడ అయిన విలువిద్యలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలువురు యువకులు, చిన్నారులు ప్రతిభ చూపుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ పతకాలను సాధిస్తున్నారు. వారిలో కొందరిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వారు సాధించిన విజయాలను తెలుసుకున్నది. ఆ వివరాలు..

7

- మహబూబ్‌నగర్, స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి)

ఎన్ని కుటుంబాలు సర్వే చేశారు

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్ బదావత్ సంతోష్
- లబ్ధిదారుల ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసి సిబ్బందికి సూచనలు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని దేవుని తిరుమాలపూర్‌లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో చేపట్టిన వరి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం పెద్దకార్పాముల గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న మాధవిని కలెక్టర్ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, ఇప్పటి వరకు ఎంత మంది వివరాలను సేకరించారు అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా లబ్ధి చేకూర్చేందుకు వీలుగా వివరాలు నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ ఎంపీడీవో నాగేంద్రం, తహసీల్దార్ జేకే మోహన్, డీటీ రమేష్ అధికారులు తదితరులు ఉన్నారు.



పెద్దకార్పాముల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా దరఖాస్తుదారులను ఫొటో తీస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద

పటిష్ట భద్రత

- కలెక్టర్ బీఎం సంతోష్



స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గద్వాల కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని గోదాములో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌తో పాటు భద్రత నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిలిచిన 'మూషిక' ప్రాజెక్టు

- మూషిక జింకల పోషణకు అనుకూలించని నల్లమల వాతావరణం
- రెండేళ్లుగా సంతతి వృద్ధి లేకపోవడమే కారణం
- పిచ్చకుంట్లోని చెరువు వద్ద పార్కు ఏర్పాటు
- 17 బ్యాచుల్లో 136 మూషిక జింకలను వదిలిన అటవీశాఖ


అమ్రాబాద్ అడవిలోకి మూషిక జింకను వదులుతున్న అటవీ శాఖ అధికారులు (ఫైల్)

మన్ననూర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో మూషిక జింకల పోషణకు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో వాటి పెంపకాన్ని రెండేళ్లుగా నిలిపివేశారు. ప్రపంచంలోనే అతి చిన్న జింకలుగా గుర్తింపు ఉన్న మూషిక జింకలు అడవుల విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జీవనం సాగించేవి. అడవుల విస్తీర్ణం తగ్గే కొద్దీ వీటి సంతతి కూడా తగ్గిపోయింది. అడవిలో ఉండే అడవి పిల్లులకు, గద్దలకు ఇవి ఆహారంగా ఉపయోగపడతాయి. కాల క్రమేణా వీటి జాతి తగ్గి అంతరించిపోయే దశలో ఉన్నాయి. ఎలుక, జింకను పోలే విధంగా మూషిక జింకల ఆకారం ఉంటుంది. ఇవి అడవిలో ఉండే పలురకాల పండ్లు తిని వాటి మలం ద్వారా అడవిలో విత్తనాలు వెదజల్లడంతో మొక్కలు సైతం ఎక్కువగా పెరిగే ఆస్కారం ఉంది. ఎలుక కంటే కొద్దిగా ఎత్తులో ఉండే మూషిక జింకలు రాత్రి వేళల్లో, వర్షాకాలంలో ఎక్కువగా అడవిలో సంచరించడం వీటి ప్రత్యేకత. వీటి జాతి పూర్తిగా అంతరించి పోయే దశలో ఉన్నట్లుగా అటవీ అధికారులు గుర్తించారు.

హైదరాబాద్‌లో మొదటి పునరుత్పత్తి కేంద్రం

2010లో దేశంలోనే ప్రథమంగా మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని హైదరాబాద్‌లోని నెహ్రూ జూ లాజికల్ పార్కులో ఏర్పాటు చేశారు. రెండు మగ, ఆరు ఆడ మూషిక జింకలతో పునరుత్పత్తిని ప్రారంభించి వాటిని సీసీ ట్రాప్ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తూ 400 పైచిలుకు ఉత్పత్తి చేశారు. అడవుల్లో కనిపించని మూషిక జింకలను తెలంగాణ ప్రాంతంలోని పలు అడవుల్లో వదిలేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. 2016లో అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో వీటి పోషణకు ప్రయోగాత్మకంగా అటవీశాఖ చర్యలు చేపట్టింది. మన్ననూరు రేంజ్ పరిధిలోని పిచ్చకుంట్లోని చెరువు సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో మూషిక జింకల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 17విడతల్లో రెండు మగ, ఆరు ఆడ జాతి మూషిక జింకలను ఒక బ్యాచ్‌గా చేసి వదిలారు. మొత్తం 136 మూషిక జింకలను పార్కులో సంరక్షణ నిమిత్తం వదిలారు. వీటికి పలు రకాల పండ్లను ఆహారంగా ఏర్పాటు చేశారు. రెండు నెలలు వీటి ఆహారాన్ని నాలుగు దశల్లో తగ్గిస్తూ అడవిలో ఉండే ఆహారాన్ని తీసుకునేలా అలవాటు చేశారు. వీటి పర్యవేక్షణ కోసం పార్కు ఆవరణ సీసీ కెమెరాల పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని ఇక్కడ నియమించారు. కెమెరాల్లో వీటి కదలికలు ఎక్కువగా కనిపించకపోగా, అడవుల్లో కార్చిచ్చు ఏర్పడిన కారణంగా మూషిక జింకల పార్కు ప్రాంతం దెబ్బతినడంతో నిర్వహణ నిలిచిపోయింది. అరుదైన జాతిని నల్లమలకు పరిచయం చేయాలనుకున్న అటవీ అధికారుల ప్రయత్నం విఫలమైందని చెప్పొచ్చు. వీటి పునరుద్ధరణకు ఉన్నతాధికారులు కొత్త మార్గం ఎన్నుకుంటే తప్పా జాతి మనుగడ సాధ్యపడే అవకాశాలు లేవు.

పార్కు నిర్వహణలో లేదు

ప్రస్తుతం పిచ్చకుంట్లోని చెరువు వద్ద మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిచిపోయింది. అధికారుల సూచనల మేరకు ఈ కేంద్రాన్ని నిర్వహిస్తాం. ఇటీవలి కాలంలో కొత్త మూషిక జింకల బ్యాచ్‌లు నల్లమలకు రాలేదు.

- దేవజ, మన్ననూరు అటవీ రేంజ్ అధికారి

కాంగ్రెస్‌లో కారుకూతలే..

- ఏడాదిలో పేదలకు ఒరిగిందేమీ లేదు
- 20 ఏళ్లుగా కొల్లాపూర్ అభివృద్ధి శూన్యం
- మంత్రి జూపల్లికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సవాల్
- ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్: ఆచారి


కొల్లాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కొల్లాపూర్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏడాది కాంగ్రెస్ సర్కారులో పాలకులవి కారుకూతలే తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఎద్దేవా చేశారు. గురువారం ఏడాది కాంగ్రెస్ పరిపాలన వైఫల్యాలను ఎండగడుతూ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి పురవీధుల గుండా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయినా పేదలకు ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. 20 ఏళ్లుగా కొల్లాపూర్ అభివృద్ధి శూన్యం అన్నారు. నియోజకవర్గంలో విద్యా, వైద్యం, ఉపాధి రంగాలలో, నిరుద్యోగులకు అవకాశాలు లేవన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో 14 ప్రధాన అంశాలతో బీజేపీ విడుదల చేసిన శ్వేతపత్రంపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. తన కృషి పట్టుదలతోనే జాతీయ రహదారి కృష్ణానదిపై ఐకానిక్ వంతెన మంజూరు చేయించినట్లు వెల్లడించారు. సోమశిల పర్యాటక అభివృద్ధి కోసం రూ.70 కోట్లు కేంద్రం మంజూరు చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు 98 జీవో బాధితులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారని, బీజేపీ వారికి న్యాయం చేసేందుకు కోర్టును ఆశ్రయించి వారికి ఉద్యోగాలు ఇప్పించేలా చర్యలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలు 66 మోసాలను ప్రజలకు వివరించి.. రాబోయే స్థానిక సంస్థల, మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అదే విధంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి పబ్లిసిటి మీద ఉన్న ప్రేమ, పేద ప్రజలపై లేదన్నారు. నేటికీ వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్ ఇవ్వలేదని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రేణులంతా కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని గ్రామాలలో ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధారాసింగ్, తమ టం శేఖర్ గౌడ్, సందు రమేష్, సాయికృష్ణగౌడ్, నారాయణ, పదిర భీమేష్, అన్వేష్, జగ్గారి శ్రీధర్‌రెడ్డి, మహేష్, శివకృష్ణ, లావణ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్కని శాఖ.. తక్కువ కేడర్

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులను బదిలీ చేయాలన్నా, సర్దుబాటు చేయాలన్నా పాత పోస్టు సర్వీసును లెక్కించాల్సి ఉంటుంది. దాని వల్ల కొత్తగా వెళ్లే శాఖలో కూడా సీనియారిటీకి అనుగుణంగా పదోన్నతులు రావడానికి వీలు పడుతుంది. కానీ, వీఆర్‌వోలను ఇతర శాఖలకు సర్దుబాటు చేసినప్పుడు లాస్ట్ పే సర్టిఫికెట్ ప్రకారం జీతం వివరాలు తీసుకొని ఆ ప్రకారం చెల్లింపులు చేస్తున్నప్పటికీ సర్వీసును మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. దాదాపు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారు కూడా తమ సర్వీసును కోల్పోయి సర్దుబాటు చేసిన శాఖల్లో పదోన్నతులు లేకుండా దిగువ స్థాయిలో పనిచేయాల్సి వస్తోంది. సర్దుబాటు సమయంలో ఆయా శాఖలకు ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు రాకపోవడమే కారణం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 786 మంది వీఆర్‌వోలు ఉండేవారు. ఇందులో కూడా 122 మంది వీఆర్‌ఓలు రెవెన్యూ, అకౌంటెంట్, సర్వే పరీక్షలు పాసైన వారు ఉన్నారు. వారికి సీనియర్ అసిస్టెంట్ లేదా రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పదోన్నతులు ఇవ్వాలి. కానీ, వారి సర్వీసు కూడా రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. మార్గదర్శకాలు లేకపోవడంతో ప్రతీ సంవత్సరం రావాల్సిన వార్షిక ఇంక్రిమెంట్, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ కూడా రావడం లేదు. ఈ విషయాలపై వీఆర్‌వోలు కోర్టుకు వెళ్లినప్పటికీ తీర్పు రిజర్వ్‌లో ఉన్నది. అయితే ఇప్పుడు ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారులను తీసుకోవాలని ఆలోచిస్తున్న నేపథ్యంలో తమను మొత్తం మందిని తిరిగి తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రూప్ 4 నియామకాలతో ఇబ్బందులు..

ప్రభుత్వం ప్రతీ శాఖలో ఖాళీ పోస్టులను నోటిఫై చేసి భర్తీ చేయాలని టీజీపీఎస్సీకి నివేదిస్తుంది. దాని ప్రకారం పోస్టులను భర్తీ చేస్తారు. వీఆర్‌ఓలను దాదాపు 42 శాఖలకు సర్దుబాటు చేశారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలో ఉద్యోగాలు సాధించిన వారికి అలాట్‌మెంట్ ఇచ్చారు. వారు వస్తే ఇప్పటికే ఆ పోస్టుల్లో పనిచేస్తున్న వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు మళ్లీ వేరే పోస్టుకు వెళ్లాల్సిన పరిస్థితి. ఆ పోస్టు మారితే ఈ రెండు సంవత్సరాల సర్వీసును కూడా కోల్పోతారు. ఇప్పటికే అగెనెస్ట్ పోస్టుల్లో పనిచేస్తున్నారు. ఆ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ కేడర్ పోస్టులు లేకున్నా విధులు నిర్వహిస్తున్న వారు కూడా ఉన్నారు. ఉదాహరణకు బీసీ వెల్ఫేర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 11 మంది జూనియర్ అసిస్టెంట్లు అవసరం. ఇప్పటికే అందులో వీఆర్‌ఓలను సర్దుబాటు చేశారు. ఇప్పుడు కొత్తగా గ్రూప్ 4 ద్వారా ఈ శాఖకు 13 మంది జూనియర్ అసిస్టెంట్లను కేటాయించారు. ఇప్పటికే పనిచేస్తున్న వీఆర్‌ఓలు మళ్లీ సర్వీసును కోల్పోవాల్సిందే. మరో ఉదాహరణ మహబూబ్‌నగర్ జిల్లాలో టీజీపీఎస్సీ నోటిఫై చేసిన వార్డు ఆఫీసర్ పోస్టులు 54 మంది ఉండగా గ్రూప్ 4 ద్వారా కొత్తగా 54 మంది మూడు మునిసిపాలిటీల కోసం వచ్చారు. అందులో ఇప్పటికే వీఆర్‌వోలు కేడర్ తక్కువగానే పనిచేస్తున్నారు. ఇప్పుడు వారిని అగెనెస్ట్ పోస్టుల్లో పెట్టి జీతాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది.

దిగువ కేడర్‌లో పనిచేస్తున్నాను



వీఆర్‌వో వ్యవస్థ రద్దు చేసిన తర్వాత రెండేళ్లు విధులు లేకుండా తీవ్ర అవమానాలు భరించాం. తర్వాత లక్కీ డిప్ ద్వారా ఆయా శాఖల్లో భర్తీ చేశారు. మాది జూనియర్ అసిస్టెంట్ కేడర్ కానీ, అన్ని శాఖల్లో అంత మొత్తం పోస్టులు లేక పోవడంతో జూనియర్ అసిస్టెంట్ వేతనంతో దిగువ స్థాయి ఉద్యోగుల బాధ్యతలు ఇచ్చారు. నాకు భూత్పూరు మునిసిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా సర్దుబాటు చేశారు. ఇప్పుడు గ్రూప్ 4 నియమించారు. మళ్లీ మా పోస్టులను ఏం చేస్తారో తెలియడం లేదు.

- రమేష్, వార్డు ఆఫీసర్, భూత్పూరు మునిసిపాలిటీ

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

- అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్
- విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన డీఈవో ప్రవీణ్‌కుమార్


వైజ్ఞానిక ప్రదర్శను ప్రారంభిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు వైజానిక ప్రదర్శనలు ఉంతో ఉపయోగపడుతాయని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాతిమా విద్యాలయంలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను డీఈవో ప్రవీణ్‌కుమార్ ప్రాంభించారు. వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి శాస్త్ర సాంకేతిక అంశాలపై ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డీఈవో మాట్లాడుతూ.. విద్యావైజ్ఞానిక ప్రదర్శనలకు విశేష స్పందన వచ్చిందన్నారు ప్రయోగాత్మాక బోధన ద్వారా సైన్స్ పట్ల ఆసక్తి పెరుగు తుందన్నారు. రెండురోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎగ్జిబిట్స్ వచ్చాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, విద్యాశాఖ సూపరింటెండెంట్ శంభు ప్రసాద్, సీఎంవో బైకాని బాలుయాదవ్, ఏఎంవో దుం కుడు శ్రీనివాస్, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ పాల్గొన్నారు.

వాడిన పూలతో అగర్‌బత్తీలు



వాడిన పూలతో సువాసన ఇచ్చే ఆరోగ్యానికి హాని కలిగించని అగర్‌బత్తీలు తక్కువ ఖర్చుతో తయారు చేయవచ్చు. మన పరిసరాలలో లభించే వాడిన పూలు దంచి అందులో చెక్కపొడి, కొద్దిగా సాంబ్రాని, గుగ్గిలం కర్పూరం కలిపి నీటితో తడిపి చేశా. గైడ్ టీచర్ శివశరణప్ప సహకారంతో వీటిని తయారు చేశాను. - హస్మిత, విద్యార్థి, జెడ్పీ హెచ్ఎస్ మూసాపేట

కరోనా గుర్తించే డోర్ బెల్



కరోనా గుర్తించేందుకు ఎలక్ట్రికల్ డోర్ బెట్ తయారు చేశా. దీన్ని డోర్ వద్ద అమరిస్తే కరోనా, ఎక్కువ టెంపరేచర్ ఉన్న వారు ఇంట్లోకి వస్తే ఇంటి డోర్ తెరుచుకోదు. ఈ పరికరాన్ని టీచర్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం పద్మ సూచనతో తయారు చేశాను.

- చంద్రిక, జెడ్పీ హెచ్ఎస్, పేరూరు, కొకుంట్ల

వరదలకు చెరువులు తెగకుండా..

వరదలు వచ్చిన సమయంలో చెరువులు, కుంటలు నిండి తెగే ప్రమాదం ఉన్నపుడు ప్లాస్టిక్‌తో తయారు చేసిన రేన్ బండ్‌ను వాడొచ్చు. దీన్ని చెరువు కట్టపై ఉంచితే తెగే ప్రమాదం ఉండదు. దీన్ని తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. ఈ రేయిన్ బండ్‌ను ఉపాధ్యాయులు యాదయ్య, శ్రీనివాస్ సహకారంతో రూపొందించాను.

- దిలీప్‌కుమార్, జెడ్పీ హెచ్ఎస్, ఇబ్రహీంబాద్, హన్వాడ



మొక్కుబడిగా వైజ్ఞానిక ప్రదర్శన

ఏటా నిర్వహించే విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మొత్తంగా మూడు వందలకు పైగా ప్రదర్శనలు వస్తాయని విద్యాశాఖ అధికారులు అనుకున్నారు.. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేశారు. కానీ ఆ స్థాయిలో రాలేదు. ప్రతీ ప్రయోగం వద్ద ముగ్గురు విద్యార్థులు ఉండేలా 1,200 మంది వస్తారని ఏర్పాట్లు చేశారు. అయితే, అందులో సగం కూడా రాలేదు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు 2023-2024 గాను 45 ప్రయోగాలు ఇన్‌స్పైర్ మునక్‌కు ఎంపికయ్యాయి. ఇందులో ఆకట్టుకునేలా ఉన్న నాలుగు ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ 45 పాఠశాలలకు ఎస్ఐఎఫ్ ఢిల్లీ నుంచి ప్రతీ పాఠశాలకు రూ.పది వేలు వారి అకౌంట్లలో జమ అయ్యాయి. ప్రదర్శనలు ప్రదర్శించేందుకు వచ్చిన విద్యార్థులకు వసతులు అనుకున్న విధంగా ఏర్పాటు చేయలేదు. జిల్లాలో ప్రారంభమైన ప్రదర్శనకు 33 పాఠశాలల నుంచే ప్రదర్శలు వచ్చాయి. అందులో సగానికి పైగా ఏదో తెచ్చాము అన్నవిధంగా ఉన్నాయి. విద్యార్థులు భోజనం చేసే సమయంలో అక్కడ కనీసం టెంట్లు కూడా వేయించలేదు.


ప్రదర్శనలు రాకపోవడంతో ఖాళీగా ఉన్న టేబుళ్లు

పబ్బతి అంజన్నకు మొక్కులు

- వేద మంత్రోచ్ఛరణలతో చండీహోమం
- ఇరుముడితో తరలివస్తున్న దీక్షాపరులు
- ఆలయం వద్ద పోలీసు బందోబస్తు, వైద్య శిబిరం ఏర్పాటు


పాదయాత్రగా వస్తున్న మాలాధారులు

పదర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు వీరయ్య శాస్త్రి, రుత్విదికులు శివప్రసాద్‌శర్మ, రఘు శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, వాస్తు పూజ, రుద్రహోమం, స్వామి వారి సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పం, సాయంత్రం నిత్యోపాసన, మన్యూ సూక్త, చండీ హోమం, బలిహరణ తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి అశ్వవాహన సేవ భక్తుల భజనల మధ్య నిర్వహించారు. దాదాపు 200 మందితో పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. పదర పీహెచ్‌సీ సిబ్బంది శశికళ, మల్లయ్య, ఆశా కార్యకర్తలను అందుబాటులో ఉంచారు.

తరలివస్తున్న భక్తులు

బ్రహ్మోత్సవాలలో భాగంగా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, మాలాధారణ చేప్టిన దీక్షాపరులు ఇరుముడితో మద్దిమడుగుకు తరలివస్తున్నారు. కొంతమంది పాదయాత్రతో వెళ్తున్నారు. ఆమన్‌గల్ మండలంలోని మంగల్‌పల్లికి చెందిన మధుసూదన్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి సోదరులు రామసదనం పేరుతో 15 నూతన గదుల నిర్మాణం చేసి ఆలయానికి ఇచ్చారు. శుక్రవారం బ్రహ్మోత్సవాలలో సాధారణంగా అన్ని పూజలతో పాటు హనుమత్ వ్రతం, పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం, మంగళ హారతి, గజవాహన సేవ నిర్వహించనున్నారు.


మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

ఆకట్టుకున్న మాదిరి ఎన్నికలు


ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థులు

- ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని పెద్దకార్పాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదిరి పంచాయతీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. సర్పంచు, వార్డు సభ్యులను విద్యార్థులు ఓటు వేసి ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా రాజశేఖర్ గెలుపొందారు. వార్డు సభ్యులుగా మల్లేష్, మహాలక్ష్మి, హారిక, చరణ్, సురేష్ గెలుపొందారు. గెలిచిన అందరికి ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జియావుద్దీన్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో ప్రత్యక్షంగా విద్యార్థులు తెలుసుకునేలా నిర్వహించడం జరిగిందని, ఎన్నికల నిర్వహణకు అధికారులు కూడా విద్యార్థులే వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం చంద్రశేఖర్, స్వామి, శివలింగం, దేవలక్ష్మి, దయాకర్‌రెడ్డి, జరీనా, మానస పాల్గొన్నారు.

రేపు సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభలు

పాలమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తొలి రాష్ట్ర మహాసభలు ఈ నెల 14వ తేదీన నిర్వ హిస్తున్నట్లు యం.రాఘవాచారి, లక్ష్మణ్‌గౌడ్, ఎస్.జగపతిరావు, హనీఫ్ అహ్మద్, ఖలీల్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్‌హాలులో మహాసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొ న్నారు. సామాజికవేత్త ముస్తాక్‌అబిలాష్, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవాచారి, బెక్కెం జనార్దన్, కవులు ప్రసం గిస్తారని తెలిపారు. మతం కంటే ముందు మనుషులమని, మానవత్వమే సమాజ ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. సాహిత్యకారుల ఈ కృషిని మహబూబ్‌నగర్ జిల్లా స్వాగతిస్తుందని తెలిపారు. ధార్మిక గ్రంథాలలో సెక్యులరిజమే ఉందని, మత ఉన్మాద చర్యలకు తావులేదని తెలిపారు. మిడిమిడి జ్ఞానం ఉన్నవారే మతోన్మాద చర్యలను ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు మృతి

కోడేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు, ఒక కోడి పుంజు చనిపోయాయి. రైతు రవీందర్‌రెడ్డి బుధవారం రాత్రి రెండు పొట్టేళ్లను ఆరు బయట కట్టేసి ఇంట్లో నిద్ర పోయాడు. అర్ధరాత్రి కుక్కలు దాడి చేసి వాటితో పాటు, ఒక కోడి పుంజును చంపేశాయి. దీంతో రూ. 30వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. అధికా రులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరారు.

సైబర్ మోసం రూ.99వేలు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసినట్లు ఎస్ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న సాయిరాంకు సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేసి రూ.4,500 బీమా చేయిస్తే రూ.1.50లక్షల లోన్ ఇస్తామని చెప్పారు. వారు చెప్పినట్లుగా ఫోన్‌కొచ్చే ఓటీపీలు చెప్పడంతో సాయిరాం బ్యాంకు అకౌంట్‌లో నుంచి రూ.99వేలకు పైగా మాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెల 5వ తేదీన అకౌంట్‌లో నుంచి డబ్బులు పోవడంతో సైబర్‌క్రైంలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

- పాల్గొన్న పలువురు పీఠాధిపతులు, స్వాములు

ఊట్కూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల కేంద్రంలో పునర్నిర్మించిన గోశాల హనుమాన్ మందిర్‌లో విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో గణపతి, శివలింగం, నంది, నాగ దేవతలు, గోమాత, నవగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి స్వామి ఆదిపరాశ్రీ, పంచసిద్ధలింగ స్వామి, శాంతానంద పురోహిత్, శివానంద స్వామి, గురుచరణ దత్తయ్య రాజయోగి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఉదయం ధాన్యాధివాసం, శయ్యాధివాసం, మండప పూజలు నిర్వహించారు. అనంతరం యంత్ర, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆ తర్వాత మహానైవేద్యం సమర్పించి, మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వై.నారాయణరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాల ప్రతిష్ఠాపనలో స్వాములు ఆదిపరాశ్రీ, పంచసిద్ధలింగ స్వామి, శాంతానంద పురోహిత్, శివానంద స్వామి

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో కొండాపూర్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధన్వాడ, డిసెంబరు 12 : (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని కొండాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లిలో ఈ నెల తొమ్మిది నుంచి 11 వరకు నిర్వహించిన నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అశోక్‌రాథోడ్, అరవింద్ నాయక్, చరణ్, రాకేష్, బాల్‌రాజు, త్రిశాంత్, శివ, బాలకృష్ణ మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరపున పాల్గొని వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్యనాయక్, పీడీ రాంమోహన్‌గౌడ్, పీఈటీ అంజనేయులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ముగిసిన సీఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్

» విజేతగా మహబూబ్‌నగర్ జట్టు



విజేతలు అయిన మహబూబ్‌నగర్ జట్టుతో నాయకులు

కోస్గి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, గుండుమల్ మండల కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతిని మహబూబ్‌నగర్ జట్టు, రెండవ బహుమతిని నిజామాబాద్ జట్టు సొంతం చేసుకున్నాయి. బాలుర విభాగంలో మొదటి బహుమతిని మహబూబ్‌నగర్ జట్టు కైవసం చేసుకోగా, రెండవ బహుమతిని ఖమ్మం జట్టు దక్కించుకుంది. ఆటలో రాణించి విజయం సాధించిన క్రీడాకారులను జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ అభినందించారు. తాను కూడా వాలీబాల్ క్రీడాకారుడినని తెలిపారు. పోటీలను చూస్తుంటే, తనకు చిన్ననాటి ఆటలు గుర్తుకొచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ భాస్కర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

బిజినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని లింగమయ్య కాలనీకి చెందిన బత్తుల రాములు, అనూష దంపతుల కుమారుడు నితిన్ తేజ (7) గురువారం ఉదయం బిస్కెట్లు కొనుక్కునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే సమయంలో అదే కాలనీకి చెందిన కంపిండ్ల మహేశ్ ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తుండగా, ప్రమాదవశాత్తు బాలుడు దాని కింద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. నితిన్ తేజ స్థానిక గురురాఘవేంద్ర పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైకు

» భర్త మృతి, భార్యకు గాయాలు

జడ్చర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నుంచి కల్వకుర్తి వెళ్లే దారిలో ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో భర్త మృతి చెందాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, చిల్వేర్ గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డిగూడకు చెందిన దంపతులు జైపాల్, శౌరీలమ్మ ద్విచక్రవాహనంపై జడ్చర్ల నుంచి గ్రామానికి వెళ్తున్నారు. గంగాపురం ఆశ్రమం సమీపంలో ఆగిఉన్న లారీని ఢీకొనడంతో బైక్ నడుపుతున్న జైపాల్ (50) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన శౌరీలమ్మను 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. జైపాల్ మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గేదె దూడను చంపిన చిరుత

దామరగిద్ద, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్ద శివారులో రైతు కోడ్లి వీరేశ్ పశువుల కొట్టంలో చిరుత పులి ప్రవేశించి గేదె దూడను చంపేసింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం పశువులను కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో చిరుతపులి దాడి చేసి గేదె దూడను చంపేసింది. మరుసటి రోజు ఉదయం పొలానికి వెళ్లిన వీరేశ్‌కు చనిపోయిన దూడ కన్పించింది. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ట్రాక్టర్‌పై పొలానికి వెళ్తుండగా, అక్కడున్న పొదల్లోనే దాగి ఉన్న చిరుతపులి బయటకు రావడంతో వారు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. దీంతో సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిరుతను పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో నెలన్నర రోజులుగా చిరుత సంచరిస్తోందని రైతులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన గుడిసె

చిన్నచింతకుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని పల్లమర్రి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ గుడిసె దగ్ధం అయ్యింది. తహసీల్దార్ ఎల్లప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గట్టుకుల రామాంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. గుడిసెలోని టీవీ, కుట్టుమిషన్, దుస్తులు, వంట సామగ్రితో పాటు రూ.50 వేల రూపాయలు కాలి బూడిదయ్యాయి. మొత్తంగా రెండు లక్షల రూపాయల వరకు ఆస్తినష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్లప్ప సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు పది వేల రూపాయలు ఇచ్చారు. సంఘటన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

గురి చూసి కొడితే... పతకం పక్కా



» విలు విద్యలో రాణిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు
» కోచ్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో శిక్షణ » రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు



విల్లు ఎక్కుపెట్టిన ఆర్చరీ క్రీడాకారుడు విష్ణువర్ధన్,

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతిభావంతులైన క్రీడాకారులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. క్రీడా సంఘాలు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల సహకారంతో ఎంతో మంది యువతీ, యువకులు, విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. ప్రధానంగా వ్యక్తిగత క్రీడాంశాల్లో ఆర్చరీ (విలువిద్య)కి ప్రత్యేక స్థానం ఉంది. పురాతన క్రీడల్లో ఒకటైన ఆర్చరీలో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద శిక్షణ పొందుతున్నారు. వారిలో పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుతూ, బంగారు, వెండి, రజత పతకాలు సాధిస్తున్నారు. వారిలో కొందరు క్రీడాకారులపై 'ఆంధ్రజ్యోతి' కథనం....

దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యం : విష్ణువర్ధన్

ఆర్చరీ అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని విష్ణు వర్ధన్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతీ కాలనీకి చెందిన అతడు ప్రస్తుతం మెదక్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) హాస్టల్‌లో ఉంటూ, డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మహబూబ్‌నగర్‌లో చదువుకుంటున్నప్పుడు కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద విలువిద్యలో శిక్షణ పొందాడు.

ఇప్పటి వరకు 30కి పైగా రాష్ట్ర స్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయిలో 15 సార్లు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. 2017 మణిపూర్ ఇంఫాల్‌లో అండర్-14 ఎస్‌జీఎఫ్ నేషనల్, 2019 ఆంధ్రప్రదేశ్, ఢిల్లీలో ఎస్‌జీఎఫ్, 2020 ఝార్ఖండ్, 2022 రాజస్థాన్, 2022 గోవా, 2022 పంజాబ్, 2023 రాజస్థాన్‌లో జరిగిన జూనియర్ నేషనల్, పంజాబ్‌లో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో సత్తాచాటాడు. హర్యానాలో ఈ ఏడాది మార్చిలో జరిగిన ఆలిండియా సాయ్ టోర్నీలో రజతం, చెన్నయ్‌లో జరిగిన ఖేలో ఇండియా ఎన్‌టీపీసీ సౌత్‌జోన్, కోల్‌కత్తాలో జరిగిన ఆలిండియా సాయ్ ఆర్చరీ టోర్నీలో రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గౌహతిలో జరిగిన జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొన్నాడు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం : కె.సునీత



ఆర్చరీ క్రీడలో అంతర్జాతీయ స్థాయికి ఎదగడమే తన ధ్యేయమని కె. సునీత అన్నారు. క్రీడల్లో రాణిస్తూనే ఐఏఎస్ అధికారి కావడం తన లక్ష్యమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం చిన్నలింగాల్‌చేడ్ తండాకు చెందిన కె.సునీత పాలమూరు పట్టణంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. హన్వాడ కేజీబీవీ అకాడమీలో ఆరవ తరగతి చదువుతున్నప్పుడు కోచ్ జ్ఞానే శ్వర్ పర్యవేక్షణలో శిక్షణ పొందింది. 15 సార్లు రాష్ట్ర స్థాయి టోర్నీ పాల్గొని ప్రతిభ చాటింది. 2018లో అస్సాం, 2019లో మహారాష్ట్ర, 2021లో ఉత్తర ప్రదేశ్, 2022లో గుజరాత్, 2023లో గోవాలో నిర్వహించిన ఐదు జాతీయ స్థాయి టోర్నీల్లో రాణించింది. ఇప్పటివరకు ఒక స్వర్ణ పతకాన్ని సాధించారు.



జ్ఞానేశ్వర్ వద్ద శిక్షణ పొందుతున్న చిన్నారులు



జిల్లా క్రీడాకారులు ఆర్చరీలో రాణిస్తున్నారు



వ్యక్తిగత క్రీడాంశాల్లో విలువిద్యకు ప్రత్యేక స్థానం ఉంది. ఖర్చుతో కూడిన క్రీడ కావటంతో గతంలో పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ ప్రస్తుతం ఎంతో మంది క్రీడాకారులు అర్చరీ నేర్చుకోనేందుకు ఆసక్తి చూపుతున్నారు. మహబూబ్‌నగర్ స్టేడియంలో గత 10 సంవత్సరాలుగా నేను శిక్షణ ఇస్తున్నాను. ఇప్పటివరకు నా వద్ద 300 మందికి పైగా విలువిద్య నేర్చుకున్నారు. 100 మందికి పైగా క్రీడాకారులు జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొన్నారు. ఒలంపిక్ క్రీడ అయిన విలువిద్యకు మంచి భవిష్యత్తు ఉంటుంది.

\- జ్ఞానేశ్వర్, కోచ్, మహబూబ్‌నగర్



అంతర్జాతీయ స్థాయికి ఎదగడమే ధ్యేయం : సుజాత

అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడమే తన ధ్యేయమని ఆర్చరీ క్రీడాకారిణి ఆర్. సుజాత అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం గుడి మల్క్యాపూర్ పంచాయతీ పరిధి రాంనాయక్ తండాకు చెందిన ఆమె ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. హన్వాడలోని కేజీబీవీలో ఎనిమిదవ తరగతి చదువుతుండగా, జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అకాడమీలో కోచ్ జ్ఞానేశ్వర్ విద్ద విలువిద్యలో శిక్షణ పొందింది. ఇప్పటి వరకు 26 సార్లు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుకున్నది. 17 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నది. 2018లో అసోం రాష్ట్రం, గౌహటి, మహారాష్ట్రలలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నమెంట్లలో పాల్గొన్నది. 2019లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, 2021లో జార్ఖండ్, మహారాష్ట్ర, 2022లో రాజస్థాన్, జమ్ము కశ్మీర్, 2023 గుజరాత్, 2024 పంజాబ్‌లలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నీల్లోనూ పాల్గొని ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలు, నాలుగు రజత పతకాలను సొంతం చేసుకున్నది.

నేటి నుంచి దత్త జయంతి ఉత్సవాలు

» మూడు రోజుల పాటు గురు చరిత్ర పారాయణం » ఉత్సవాలకు పూర్తయిన ఏర్పాట్లు



దత్తాత్రేయ స్వామి మూల విగ్రహం

నారాయణపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా సరిహద్దులో, కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మాణిక్యగిరి వద్ద నిర్మించిన దత్తాత్రేయ ఆలయంలో ఈనెల 13 నుంచి దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15 వరకు మూడు రోజుల పాటు దత్త గురు చరిత్ర పారాయణం, దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కార్యదర్శి కృష్ణ కోర్వార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

1980లో ఆలయ నిర్మాణం

ఈ ప్రాంతంలో జంతు బలిని అరికట్టేందుకు మాణిక్యగిరి కొండ కింద దత్తాత్రేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని మాతా మాణికేశ్వరీ దేవి ఆజ్ఞాపించారు. అందుకు అనుగుణంగా నారాయణపేటకు చెందిన రామారావ్ కోర్వార్, గంగమ్మలు 1980లో దత్తాత్రేయ ఆలయాన్ని నిర్మించారు. 1997లో గుజరాత్‌లోని గిరినాథ్ నుంచి పాలరాతి విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. 2004లో మాతా మాణికేశ్వరి తన వెండి పాదుకలను కృష్ణ కోర్వార్‌కు అందించారు. అప్పటి నుంచి ఆలయంలో ప్రతీ నిత్యం పాదుకాపూజ కొనసాగుతోంది. ప్రతీ సంవత్సరం దత్త జయంతి, వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దత్త జయంతి ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

అమ్మ ఆజ్ఞాను సారమే..

మాతా మాణికేశ్వరి ఆదేశానుసారం దత్తాత్రేయ స్వామి ఆలయ నిర్మాణం చేపట్టి, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతీ సంవత్సరం దత్త జయంతి సందర్భంగా గురుచరిత్ర పారాయణం, ప్రత్యేక పూజలను వైభవంగా జరిపిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని వసతులు సమకూర్చాం.

\- కృష్ణా కోర్వార్, దత్తాత్రేయ ఆలయ ట్రస్ట్ కార్యదర్శి, నారాయణపేట

కల్లు తాగొద్దన్న కొడుకు

ఆత్మహత్య చేసుకున్న తల్లి



తలారి కాశమ్మ (ఫైల్)

ఖిల్లాఘణపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కల్లు తాగొద్దని కుమారుడు మందలించడంతో మనస్తాపం చెందిన తల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సురేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. మానాజీపేట గ్రామానికి చెందిన తలారి కాశమ్మ (68) తరచూ కల్లు తాగుతుండటంతో సంసారంలో గొడవలు జరిగేవి. దీంతో ఎక్కడైనాపడి చనిపోతా అంటుండేది. అదే విధంగా గురువారం కూడా కుమారుడు తలారి శ్రీను మందలించాడు. దీంతో గ్రామం లోని పెద్ద చెరువులో దూకి ఆమె ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

» ఆత్మకూరులో అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపు

ఆత్మకూరు, డిసెంబరు 12 : వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి పట్టణంలో ఊరేగించారు. అయ్యప్ప స్వామి వేషధారణలో చిన్నారులు, బాలికల నృత్యాలు, అయ్యప్ప స్వాముల భజన కీర్తనల నడుమ ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమానికి ఆత్మకూరుతో పాటు, చుట్టు పక్క గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ స్థల దాతలు మొగిలి శ్రీధర్‌గౌడ్, గాడి లక్ష్మీనారాయణ, మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవి కుమార్ యాదవ్, కౌన్సిలర్లు అశ్విన్‌కుమార్, రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి గంగాధర్‌రెడ్డి, నాయకులు మణివర్ధన్‌రెడ్డి, ఎస్‌టీడీ శ్రీనివాసులు, మెకానిక్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపులో అర్చకులు, స్వాములు

మిడ్జిల్ మండలంలో కేంద్ర బృందం పర్యటన

» కేంద్రం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పరిశీలన » ప్రజలతో మాట్లాడి అభిప్రాయ సేకరణ

మిడ్జిల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ బృందం సభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో పర్యటించారు. మల్లాపూర్, వెలుగొమ్ముల, దోనూర్, సింగందొడ్డి, భైరంపల్లి, మంగలిగడ్డ తండా గ్రామ పంచాయతీల్లో 15వ ఆర్థిక సంవత్సరం నిధులకు సంబంధించిన వివరాలను ఆరా తీశారు. వెలుగొమ్ముల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై సర్వే సూపర్‌వైజర్ ఎల్.శ్రీకాంత్, సభ్యుడు రావుకుమార్ ప్రజలతో మాట్లాడారు. ఇంకా చేపట్టాల్సిన పనులను తెలుసుకున్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, ఎంపీవో జగదీశ్‌కుమార్, సర్వే ఇన్‌చార్జి శ్రవణ్, పంచాయతీ కార్యదర్శులు రాజశ్రీ, వెంకటేశ్, సత్యనారాయణ, నాగేందర్ పాల్గొన్నారు.



వెలుగొమ్ముల గ్రామస్థులతో కేంద్ర బృందం సభ్యులు

ఇంటర్వ్యూ..

పశువుల సమగ్ర సమాచారం ఇవ్వాలి

-పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి



తిమ్మాజిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పశువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మీ ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు అందించాలని పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పలు విషయాలు తెలిపారు.

పశుగణన ఎప్పుడు ప్రారంభమైంది?

అఖిల భారత పశుగణన కార్యక్రమం గ్రామాలలో అక్టోబరు 25న ప్రారంభమైంది. 2025 ఫిబ్రవరి 25వ తేదీ వరకు గ్రామాలలో కొనసాగుతుంది. రైతులు తమ వద్ద ఏయే పశువులు ఉన్నాయో సమగ్రమైన సమాచారం ఇవ్వాలి.

పశుగణన పశు వైద్య సిబ్బంది చేస్తున్నారా, లేదా ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్నారా?

పశుసంవర్ధక శాఖ సిబ్బంది మాత్రమే బృందాలుగా ఏర్పడి పశుగణన చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించలేదు. రైతులకు ఎలాంటి అపోహలు వద్దు. పశుగణనకు సహకరించి సమాచారాన్ని అందించాలి.

పశుగణన ద్వారా రైతులకు కలిగే లాభాలు ఏమైనా ఉన్నాయా?

రైతులు విషయ సేకరణదారులకు తమ పశువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించి పశుగణన రంగ అభివృద్ధి, తద్వారా పథకాల రూపకల్పనకు సహకరించడం జరుగుతుంది. రైతుకు లాభాలు చేకూరుతాయి. భారత్ పశుదాణాకు సంబంధించి దరఖాస్తులు నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.

న్యూస్ బాక్స్

టెక్నికల్ అసిస్టెంట్ రిమాండ్ : ఎస్‌ఐ

చారకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)గా విధులు నిర్వహించిన సంపత్‌కుమార్‌ను గురువారం అచ్చంపేట కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో జాతీయ ఉపాధిహామీలో టీఏగా విధులు నిర్వహించిన సంపత్‌కుమార్ 2020 కంటే ముందు ఉపాధి పనుల్లో రూ. 6,50,902 లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు 2023లో అప్పటి ఎంపీడీవో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి సంపత్ కుమార్ పరారీలో ఉన్నాడు. నమ్మదగ్గ సమాచారంతో కల్వకుర్తిలో అతనిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరుచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గ్రామస్థుల ఆందోళన.. అంతలోనే సమస్య పరిష్కారం

పదర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మురుగునీటి కాలువను శుభ్రం చేయాలని మండల కేంద్రమైన పదరవాసులు ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన చేపట్టగా, అంతలోనే అధికారులు ఆ సమస్యను పరిష్కరించారు. పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శితో తమ సమస్యను చెప్పుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఎంపీడీఓ కార్యాలయానికి ఫిర్యాదు చేయడానికి వస్తే, ఉదయం 10.30 గంటలు అయినా కార్యాలయంలో ఏ ఒక్క అధికారి కనిపించలేదని పేర్కొన్నారు. ఇదే విషయంపై 'ఆంధ్రజ్యోతి' గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిన వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బందితో మురుగునీటి కాలువ తీయించామని వాట్సప్‌లో ఫొటోలు పంపారు.

వరి కొనుగోలు కేంద్రం పరిశీలన

లింగాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గురువారం లింగాలలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో అధ్యక్షుడు హనుమంతురెడ్డి పరిశీలించారు. సీఈవో పాండు ద్వారా వివరాలను అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఈవో పాండు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై వేధింపులు అరికడదాం

తెలకపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పిల్లలపై వేధింపులను అరికడుదామని కోనేరు సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆలేరు, పెద్దూరు గ్రామాలల్లో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులు కాపాడుదామని పిల్లల అక్రమ రవాణా, బాల్య వివాహాలు నిర్మూలిద్దామని అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా పిల్లల అక్రమ రవాణాకు గురైన వెంటనే టోల్ ఫ్రీ 1098కు చైల్డ్ హెల్ప్ లైన్‌కు తెలియజేయాలని తెలిపారు. కోనేరు సంస్థ కమ్యూనిటీ మొబిలైజర్ రజిత, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి రామాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పెంట్లవెల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో కొండపై వెలిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం మధ్యాహ్నం అలివేలు మంగ సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లవెల్లి చంద్రయ్య ఏర్పాట్లు చేస్తున్నారు.

డైట్ చార్జీల పెంపుపై సంబురాలు నిర్వహించాలి

- 14న డైట్‌చార్జీల పెంపు ప్రారంభోత్సవం

- విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇటీవల 40శాతం పెంచిన డైట్ చార్జీలను ఈనెల 14న ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈనెల 14న జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, మోడల్ స్కూల్స్ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలలో డైట్‌చార్జీలు పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని తెలిపారు. అందుకనుగుణంగా విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్, డీఈవో రమేష్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కాజా నజీమ్‌అలీ, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంలాల్, ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి ఫిరంగి, డీసీ వోలు, ప్రిన్సిపాల్స్, వార్డెన్లు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

- బల్మూరు, అచ్చంపేటలో మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన



బల్మూరులో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూరు/ అచ్చంపేట టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇల్లులేని ప్రతీ పేదవాడికి ఇల్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం బల్మూరు, అచ్చంపేటలో మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇంటి నమూనాను మండల కేంద్రానికి వచ్చే వివిధ గ్రామాల ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహం, కేజీబీవీలను తనిఖీ చేసి, సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీపతిరావు, జంగయ్య, సుధాకర్ గౌడ్, కాశన్నయాదవ్, నిరంజన్‌గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, శంకర్‌గౌడ్, శ్రీనివాసులు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఖదీర్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్ : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్ కోసం భూమి పూజ చేశారు. అనంతరం పట్టణంలో సీఎం కప్ టోర్నమెంట్స్ క్రీడలను ఆయన ప్రారంభించారు. పట్టణంలోని మినీ ఎన్టీఆర్ స్టేడియంను రాజీవ్ ఎన్టీఆర్ స్టేడియంలో మార్చుచేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్ర మంలో ఎంఈవో జీవన్ కుమార్, ఎంపీడీవో మధసూదన్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివా సులు, నాయకులు మల్లేష్, సీఎం రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుక్మద్దీన్ మృతి పార్టీకి తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే గుర్కజైపాల్‌యాదవ్



ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు రుక్మద్దీన్ మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని జీడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రుక్మద్దీన్ వారం రోజుల కింద గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బి.మధు, కో ఆప్షన్‌మెంబరు మనోహర్‌రెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉప సర్పంచ్ ఖాజా, నాయకులు మల్లేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, వట్టెపు కిశోర్, తాండ్రా తిరుపతి, వట్టెపు గణేష్ ఉన్నారు.

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి



వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కల్వకుర్తి విజయ డెయిరీ కమిటీ సభ్యులు

కల్వకుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ పాల బిల్లులు చెల్లించేలా చూడాలని సీఎం సలహాదారుడు వేంనరేందర్ రెడ్డికి పాడి రైతులు వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులతో పాటు రావాల్సిన ప్రోత్సాహకాన్ని సైతం విడుదల చేయించాలని కోరారు. కల్వకుర్తి విజయ డెయిరీ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తెలిపారు.

నిషేధిత మందులు అమ్మితే చర్యలు

తిమ్మాజిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత మందులు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని మరికల్ గ్రామంలో ఎరువులు, విత్తనాలు పురుగుల మందులు అమ్మే దుకాణాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. రైతులకు పంపిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులకు సంబంధించిన రికార్డులను అదేవిధంగా గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను ఈ పాస్ మిషన్‌ను పరిశీలించి దుకాణపు యజమానికి పలు సూచనలు చేశారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కోడేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలను గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాలను, భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించి, మెరుగైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు సురేందర్, జములయ్య పాల్గొన్నారు.

దోమల పెంటలో గ్యార్మీ గంధోత్సవం

దోమలపెంట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండలం దోమలపెంటలో గురువారం ముస్లింలు గ్యార్మీ గంధోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లిం పెద్దలు ఇబ్రహీం, ఫయిముల్లా షరీఫ్ మొయిజొద్దీన్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం గ్యార్మీ గంధోత్సవం జరుపుకుంటామని తెలిపారు. భక్తి శ్రద్ధలలో దర్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వంహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో దోమలపెంట, పాతాళగంగ, ఈగలపెంట గ్రామాల ప్రజలు పాల్గొంటారు. అందరికి విందు భోజనాలు ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహ్మద్, సల్మాన్‌ఖాన్, గౌస్, వహబ్, రసూల్, ఇసాక్, ఇస్మాయిల్ నద్దిమ్ మోసీన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

బల్మూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తి సత్యసాయి మందిరంలో పదవ తరగతి విద్యార్థులకు జరిగిన జిల్లా స్థాయి గణిత టాలెంట్ పరీక్షలో మండల పరిధిలోని కొండనాగుల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి తెలిపారు. జిల్లాలోని 20మండలాల నుంచి సెలెక్ట్ అయిన 200 విద్యార్థులు పరీక్ష రాయగా తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, గణిత ఉపాధ్యాయులను హెచ్‌ఎం, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మీసేవ ద్వారా మరో తొమ్మిది సేవలు

- అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మీ సేవ కేంద్రాల ద్వారా మరో తొమ్మిది రకాల సేవలు అందుబాటులోకి అందుబాటులోకి వచ్చాయని జిల్లా రెవెన్యూ అదనపు కె.సీతారామారావు గురువారం తెలిపారు. కొత్తగా ప్రవేశ పెట్టిన సేవల్లో గ్యాప్‌సర్టిఫికెట్, పౌరుడి పేరు మార్పు, స్థానిక అభ్యర్థి సర్టిఫికెట్, మైనార్టీ సర్టిఫికెట్, కులం ఆదాయం సర్టిఫికెట్ పునర్ జారీ, క్రిమిలేయర్-నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసుల మానిటరింగ్ సిస్టమ్, వన్య ప్రాణుల మానవ హత్య/పశువుల హత్యలకు పరిహారం, సామిల్/టింబర్ డిపో ఫ్రెష్ అండ్ రెన్యువల్ సర్టిఫికెట్లు మీ సేవా కేంద్రాల ద్వారా జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుం దని పేర్కొన్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా నూతనంగా ప్రవేశపెట్టిన సేవలను సమర్థవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలని మీసేవా జిల్లా మనేజరు నరేష్ కుమార్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఎంపీని కలిసిన శివకుమార్

కల్వకుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం ఒకే ఎన్నికలపై మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణను ఢిల్లీలో కలిసినట్లు కల్వకుర్తికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల కలిగే ఉపయోగాలపై ఎంపీ డీకే.అరుణతో చర్చించినట్లు పేర్కొన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి సేవా రంగంలో కృషి చేస్తున్న యువత కలిసి సంవిధాన్ సపోర్టు అనే బృందంగా ఏర్పడి దేశంలోని పార్లమెంట్ సభ్యులను కలుస్తున్నట్లు పేర్కొన్నారు. మౌలికిశోర్, తదితరులు ఉన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలను సకాలంలో గుర్తించాలి : డీఎంహెచ్‌వో

కందనూలు, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో వచ్చే లోపాలను వెంటనే గుర్తించి సకాలంలో అవసరమైన చికిత్స అందించడం వల్ల ఆ లోపాలను అధిగమించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ.స్వరాజ్యలక్ష్మీ, ఆర్‌బీఎస్‌కే.మొబైల్ హెల్త్ టీం వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. గురువారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ వైద్యాధికారులకు, సిబ్బందికి ఈ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను పరీక్షించిన తర్వాత గుర్తించిన అనారోగ్య సమస్యల నుంచి బయట పడేంత వరకు ఫాలోప్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, డాక్టర్ భీమానాయక్, మొబైల్ హెల్త్ టీం వైద్యాధికారులు, ఎంపీహెచ్‌ఈవో విజయ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

అచ్చంపేటటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్ని పార్టీల నాయకుల సమావేశంలో పాల్గొన్ని మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితాను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం పార్టీల నాయకులు రవీందర్, రాజేందర్‌రెడ్డి, లోక్యానాయక్‌లు పలు సూచనలు చేశారు. మన్నెవారిపల్లి గ్రామంలో డబుల్ ఓట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి జన్మదినోత్సవం



తన జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/ తిమ్మాజిపేట/ బిజినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో శాసన మండలి సభ్యుడు కూచకుళ్ల దామోదరరెడ్డి 78వ జన్మ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో కేక్‌కట్ చేయించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను దామోదర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూచకుళ్ల నరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగనూల్ కృష్ణారెడ్డి, ఎండీ. హబీబ్, సింగిల్‌విండో చైర్మన్ బండారు శ్రీనివాస్‌రెడ్డి, వంకేశ్వరం నిరంజన్, వంకేశ్వరం లక్ష్మయ్య, మణెమ్మ, ఎండీ. హబీబ్ ఖాన్, ఎండీ. గౌస్, వనపట్ల దర్మారెడ్డి, గన్యాగుల గోపాల్‌రెడ్డి, అనంతసాగర్ నారాయణ గౌడ్, తెలక పల్లి యాదయ్య, కౌన్సిలర్లు కావలి శ్రీను, జక్కా రాజ్, నిజాం పాల్గొన్నారు.

● తిమ్మాజిపేటలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన ఫ్లెక్సీ ముందు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు మల్లయ్య గౌడ్, వెంకటరామిరెడ్డి, ఉస్మాన్, మాధవులు, లక్ష్మీనారాయణ, రవూఫ్, హర్షవర్ధన్‌రెడ్డి, ముబారక్, నాగసాయిలు, ఎల్లారెడ్డి, లింగం, అనంతచారి, మల్లేష్, అశోక్‌రెడ్డి, వరుణ్ పాల్గొన్నారు.

● బిజినేపల్లి అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. స్థానిక ప్రశాంత నిలయంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లు గంగనమోని తిరుపతయ్య, అమృత్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, ఈశ్వర్, నగేష్, కేటీ తిరుపత య్య, ముక్తార్, వీరేష్, వాల్యానాయక్ పాల్గొన్నారు.

బాలికల సవతి గృహాన్ని తనిఖీ చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.అరుణాదేవి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంటగది, విద్యార్థుల గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భగవద్గీతతో పాటు వేవేకనందుడు తదితర దేశ ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. వార్డెన్ ఎప్పుడూ అందుబాటులో ఉంటూ విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా పర్యవేక్షణ చేయాలన్నారు. అదేవిధంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి తరంగిణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

- డీఈవో రమేష్‌కుమార్

చారకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశం నిర్వహించుకొని విద్యార్థులపై ప్రత్యే శ్రద్ధ తీసుకోవాలని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీని డీఈవో ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతిలో ఆయా సబ్జెక్టుల్లో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కేజీబీవీ ఎస్‌వో మంజులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సీరాణి, జీహెచ్ ఎంభగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం 1 కప్ తెలంగాణ మండల స్థాయి క్రీడా పోటీలను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం తహసీల్దార్ సునీత, ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, ఎంఈవో ఝాన్సీరాణిలతో కలిసి డీఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, జూపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ వరలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గణేష్‌గౌడ్, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులుగౌడ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలుపర్చాలి

కందనూలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని తక్షణమే అమలుపర్చాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతిలు కోరారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం రెండవ జాతీయ మహాసభ కరపత్రాలను గురువారం నాగర్‌కర్నూల్ పట్టణలో కామ్రేడ్ లక్ష్మణచారి భవనంలో ఆవిష్కరించారు. జనవరి 5, 6, 7వ తేదీల్లో అఖిల భారత దళిత జాతీయ ఉద్యమం రెండవ మహాసభలు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవనంలో జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపాగ శ్రీనివాసులు, కొౖట బాలు, జిల్లా నాయకులు ఉషన్న, కొమ్ము వెంకటయ్య, శివశంకర్, స్వాములు, కృష్ణయ్య, శివయ్య, నిరంజన్, బాలస్వామి పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14, 15 తేదీల్లో అచ్చంపేటలో నిర్వహించ తలపెట్టిన సీపీఎం జిల్లా మూడవ సహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య కార్మికులను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ కార్మిక సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడులుగా విభజించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, హమాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు రాధాకృష్ణ, పేయింటర్ సంఘం నాయకులు శివశంకర్, కార్మికులు జయశ్రీ, శిరీష, వసంత, కృష్ణవేణి, సుజాత, అమీనా, వెంకటమ్మ, జాంగీర్‌బీ, కృష్ణయ్య, వెంకటయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

వంగూరు : ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 14, 15న అచ్చంపేటలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను రైతులు, కూలీలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భగవద్గీత పఠనంతో మనిషిలో పరివర్తన



అంతర్జాతీయ భగవద్గీత దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

బిజినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత పఠనంతోనే మనిషిలో పరివర్త న సాధ్యమవుతుందని నాగర్‌కర్నూల్ సబ్ జైలు సూపరింటెండెంట్ నాగరాజు అన్నారు. అంతర్జాతీయ భగవద్గీత దినోత్సవం సందర్భంగా రిషి పరంపర ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నందివడ్డెమాన్ గ్రామంలో భగవద్గీత దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందువుల పవిత్రగ్రంథం భగవద్గీత పుట్టిన రోజు కావడంతో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా హిందూ పంచాంగం ప్రకారం మార్గశిర శుద్ధ ఏకాదశి రోజు జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. విద్యార్థులకు ఉచితంగా అందిస్తూ భగవద్గీత పఠనం చేయిస్తున్న ప్రముఖ న్యాయవాది ఏసీపీ శ్రీరామ్ ఆర్యను అభినం దించారు. ప్రముఖ న్యాయవాది, ఆర్‌ఎస్‌ఎస్ పాలమూరు విభాగ్ సంచాలకులు ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నందీశ్వర, శనైశ్వర ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రీలు ప్రసంగించారు. ఉపాధ్యాయుడు నిరంజన్, న్యాయవాది వి.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.